# చీకటి రేయి వెన్నెల హాయి



*ప్రహార వ్రణ మార్గ విషమే*
*జాయా కృచ్ఛేన లభతే తస్య నిద్రాం*
*గ్రామణీ సుతస్య ఉరసి*
*పల్లీ పునః సాసుఖం స్వపితి*

**భావం:** దెబ్బల వల్ల గాయాలు కలిగించే ఆ ఎగుడు దిగుడుదారిలో గ్రామాధికారి కొడుకు వక్ష స్థలంపై తల పెట్టుకుని పడుకున్న అతని భార్యకు నిద్రలేదు కానీ పల్లె మొత్తం హాయిగా నిద్రస్తోంది.

ఆ పల్లెటూళ్ళో గ్రామాధికారికి లేక లేక కొడుకు పుట్టాడు. గ్రామాధికారి మహావీరుడు, పరిపాలనాదక్షుడు బందిపోట్ల నుంచి గ్రామ

ప్రజలను కాపాడేవాడు. ఊరిలో ఏ అన్యాయమూ జరగకుండా చూసేవాడు. అతనికి సంతానం కలగకపోడం ఊరందరినీ కలవరపెట్టింది. చాలాకాలానికి కొడుకు జన్మించడం గ్రామానికే పండుగ అయింది. కానీ ఆ ఆనందం ఎక్కువ కాలం లేదు. పుట్టుకతో వచ్చిన బుద్ధులో, పెంపకంలో లోపమో కానీ పిల్లవాడు అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. పొలంలో కాయలూ, తోటలలో పళ్ళూ,ఇళ్ళలో పిండివంటలూ తస్కరించేవాడు. స్నేహితులతో ఆవారాగా తిరుగుతున్నాడని గ్రహించిన తండ్రి గురుకులానికి పంపించాడు. చదువు అబ్బలేదు.

యౌవనం మాత్రం ప్రవేశించింది. ఏ చదువూ చదవకుండా ఇంటికి వచ్చిన కొడుక్కి గ్రామ పరిపాలనా వ్యవహారాలు గ్రామాధికారి నేర్పబోయాడు. కొడుకు మనస్సు మన్మధ సామ్రాజ్య వ్యవహారాల గురించే ఆలోచించింది. అతని కాళ్ళు సానివాడకి దారితీశాయి. మకాం అక్కడే పెట్టేశాడు. గ్రామాధికారీ, భార్యా ఆలోచించారు. అందమైన అమ్మాయితో పెళ్ళిచేస్తే అబ్బాయి కుదురుగా ఇంటి పట్టున ఉంటాడనుకున్నారు.

రాజు తలిస్తే దెబ్బలకు కొదవా? గ్రామాధికారితో సంబంధమంటే చుట్టుపక్కల గ్రామాలలో చాలామంది ఎగిరి గంతేశారు. అందరిలోకీ అందమైన అమ్మాయిని తెచ్చి పెళ్ళిచేశారు. అయినా అబ్బాయిగారి ఆగడాలు ఆగలేదు. "ఆ మాత్రం భర్తను అలరించలేవా" అని ఆ అమ్మాయిని అందరూ తిట్టారు. మనోనిగ్రహం లేని మనిషిని ఎవరూ కట్టెయ్యలేరు. గంగాపతనం వంటిదే భ్రష్టుల సంపాతం.

గ్రామాధికారి కొడుక్కి వేశ్యాసాంగత్యం తృప్తినివ్వలేదు. సంసార స్త్రీలపై మోజు కలిగింది. పెద్ద రైతు కోడలూ, నంబిగారి మరదలూ, కరణంగారి అమ్మాయీ అందరికీ వలవెయ్యాలనుకున్నాడు. వోటు సరాగాలు ప్రారంభించాడు. గ్రామాధికారి మీద గౌరవంతో కొంతకాలం ఆగిన తర్వాత ఊరివారందరూ తిరగబడ్డారు. పంచాయితీ పెట్టారు. కొడుకు అన్న ప్రేమ, పక్షపాతం లేకుండా గ్రామాధికారి బహిష్కార శిక్ష విధించాడు. వెంటనే ఊరు

వదిలి పొమ్మన్నాడు. పతివ్రతా ధర్మంగా కోడలు కొడుకుతో పాటు ఊరు వదిలి బయల్దేరింది. దారినిండా రాళ్ళు దెబ్బలు తగిలి గాయాలవుతున్నాయి. దారి మధ్యలో ఆటవికుల వద్ద వెదురు బియ్యం, తేనె తిని నడక సాగించారు.

రాత్రి అయింది. చెట్టు కింద పడుకున్నారు. భార్యను దగ్గరగా తీసుకుని ఆమె తలను తన వక్షస్థలంపై పెట్టుకుని “నేను పూర్తిగా మారిపోయాను. నీకిక ద్రోహంచెయ్యను” అన్నాడు. ఆమెకు నమ్మకం లేదు. అటవికుల తండాలో యువతిని చూసి సైగలు చేసి ఆపైన వారి నాయకుడికి భయపడి ఊరుకున్నాడని ఆమెకు తెలుసు. అటువంటి వ్యక్తి మారతాడా?

వ్యసనాలున్నాయని తెలిసీ అతని తల్లితండ్రులు వివాహం చేశారు. గ్రామాధికారితో వియ్యమని తన తల్లితండ్రులు ఎగిరి గంతేసారు. తన గురించి ఆలోచించింది ఎవరు? అందమైన భార్యలు లేకనే వ్యభిచరిస్తున్నారా? ఎంత ప్రయత్నించినా ఆమెకు నిద్ర లేదు. దుర్మార్గుడి పీడ విరగడైందని గ్రామ ప్రజలు హాయిగా నిద్రపోతున్నారు. గ్రామాధికారి కోడలి కథ వంటిది నేడూ జరుగుతూనే ఉంది కదా.

******